ప్రజాశక్తి
సోమవారం 21 జులై 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

సభలో ప్రసంగిస్తున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

యజమానితో సంబంధం లేకుండా

కౌలు కార్డులివ్వాలి

- కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
- కౌలు రైతు సంఘం జిల్లా మహాసభలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ కౌలు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం బాపట్ల జిల్లా మహాసభలో వక్తలు డిమాండ్ చేశారు. కౌలు రైతుసంఘం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభ ఆదివారం కారంచేడు మండలం, స్వర్ణ గ్రామంలో గోల నాగరాజు అధ్యక్షతన జరిగింది. సభ ప్రారంభంలో కౌలురైతు సంఘం జెండాని ఏడు కొండలు ఆవిష్కరించారు. సభలో కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు మాట్లాడుతూ వ్యవసాయం సంక్షోభంలో ఉందన్నారు. ఏ పంటలకూ గిట్టుబాటు ధరలు లేని పరిస్థితి నెలకొందని, ఈ సంవత్సరం పొగాకు రైతులు తమ పంట అమ్ముడుపోక ఇక్కట్ల పాలయ్యారన్నారు. కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారన్నారు. మిర్చి రైతులు, వరి సాగు చేసిన రైతులు తగిన గిట్టుబాటు ధర లేక నష్టపోయారన్నారు. అందులోనూ కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణమని వాపోయారు. రైతు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం దాటవేత ధోరణి ▶ 2లో

జనం నాడి దొరికిందా.?

- ఇంటింటికీ తిరుగుతున్న పాలకపక్ష నేతలు
- ఏడాది పాలనపై ప్రజల్లో ఎలా ఉందనే దానిపై తర్జనభర్జనలు
- జనం నుంచి వచ్చే విజ్ఞప్తులకు హామీలిస్తూ ముందుకు..

'సుపరిపాలన' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

'సుపరిపాలన తొలి అడుగు' పేరుతో పాలకపక్షం చేపట్టిన ఇంటింటికీ మంత్రులు, ఎమ్మెల్యేల కార్యక్రమం కొనసాగుతోంది. పాలకపక్ష నేతలు నియోజకవర్గాల్లో ఈ నెల రెండు నుంచి సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. గ్రామాల్లో యంత్రాంగాన్ని వెంటబెట్టుకొని ఇంటింటికీ తిరుగుతున్నారు. మూడు వారాలు కావస్తోంది. అన్ని ఇళ్లను కవర్ చేయాలని ఆదేశాలు వచ్చాయి. మరో ఎన్నికల ప్రచారం సాగుతోందా? అన్నట్లుగా పాలకపక్ష కార్యక్రమం నడుస్తోంది. మరో వైపు ఇదే సమయంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' పేరుతో వైసిపి నేతలు నియోజకవర్గ స్థాయిలో సదస్సులు పెడుతున్నారు. ప్రభుత్వంపై ఎదురుదాడి చేస్తున్నారు. రెండు పార్టీల కార్యక్రమాలు గ్రామాల్లో హోరాహోరీగానే సాగుతున్నాయి. అయితే పాలకపక్షం ఏడాది పాలనపై జనంలోకి వెళ్లడం ఒక రకంగా చెప్పాలంటే సాహసంగానే కనిపిస్తోంది. ఎందుకంటే మొన్నటివరకూ ఎన్నికల మేనిఫెస్టో అమలు ప్రశ్నార్థకంగానే మారింది. పేదల్లో ఎదురుచూపులే మిగిలాయి. దీపావళి నాడు మూడు గ్యాస్ సిలిండర్ల ఉచిత పథకం ఆచరణలోకి వచ్చింది. దాన్నుంచి ఆశించినంత సానుకూలతైతే రాలేదు. ఇటీవల తల్లికి వందనం పథకంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో డబ్బులు పడ్డాయి. వెంటనే పాఠశాలలు ప్రారంభం కావడంతో కుటుంబాలకు ఉపయోగపడ్డాయి. దీంతో జనంలోకి వెళ్లడానికి కొంత సానుకూలత వచ్చింది. ఈ ఆశతోనే మంత్రులు, ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో తిరుగుతున్నారు. అయితే ఇప్పటికే చాలా మంది ఎమ్మెల్యేలు 50 శాతానికి పైగా ఇళ్లకు తిరిగారు. జనం నుంచి వచ్చే విజ్ఞప్తులను వింటూ ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వం పనితీరు ఎలా ఉంది? చంద్రబాబు పాలన ఎలా ఉంది? తల్లికి వందనం కింద డబ్బులు పడ్డాయా? గ్యాస్ డబ్బులు వచ్చాయా? పెన్షన్ వస్తుందా? లేదా? ఇలా పలు రకాలుగా గ్రామాల్లో ఇళ్లకు వెళ్లినప్పుడు జనాన్ని ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తున్నారు. కరపత్రాలు ఇస్తున్నారు. ఇప్పటికే అమలు చేసిన పథకాలు, భవిష్యత్‌లో చేయబోయే పథకాలపై కరపత్రాలు ముద్రించి ఇంటింటికీ ఎమ్మెల్యేలే స్వయంగా అందజేస్తున్నారు. వారి నుంచి సానుకూలతే వస్తోంది. ఎవరూ మొఖానే బాగా లేదని చెప్పే పరిస్థితి కూడా లేదు. అయితే జనంలో ప్రభుత్వం పట్ల ఎలాంటి స్పందన ఉందనేది నేతలకు బోధపడుతోంది. జనం ▶ 2లో

జోరు వాన

చీరాలలో దంచి కొడుతున్న వర్షం

ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పలు చోట్ల ఆదివారం ఓ మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. చీరాలలో పలు చోట్ల విద్యుత్ సరఫరా ఏర్పడింది. వెంటనే విద్యుత్ సిబ్బంది.. మరమ్మతులు చేసి.. సరఫరాను పునరుద్ధరించారు.

ప్రజాసమస్యలు సత్వరమే పరిష్కరించాలి

మంత్రి స్వామి 5లో ▲

సమానత్వం కోసం ఉద్యమించాలి

ఐద్వా నగర మహాసభలో డాక్టర్ ఉదయిని 5లో ▲

అనురాగమూర్తికి అశ్రునివాళులు...

నిరంతర కృషితో ఉన్నత శిఖరాలను చేరాలని
ఎల్లవేళలా మా వెన్నుతడుతూ
మా అందరి జీవితాలకు బాటలు వేసిన మా మార్గదర్శి
శ్రీమతి యక్కంటి సుబ్బమ్మ గారి మరణం
మాకు తీరనిలోటు. దివికేగిన వారి పవిత్రాత్మకు
శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
అశ్రునయనాలతో నివాళులర్పిస్తున్నాము.

కీ॥శే॥ యక్కంటి సుబ్బమ్మ గారు
మరణం: 11-07-2025
మండల అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ అధ్యక్షురాలు
యడవల్లి గ్రామం, పెద్దదోర్నాల మండలం.

ఇట్లు భర్త
యక్కంటి రామనారాయణరెడ్డి
కుమారులు
యక్కంటి అభిలాష్ రెడ్డి,
యక్కంటి రాజేష్ రెడ్డి

గమనిక: 21-07-2025న సోమవారం మధ్యాహ్నం యడవల్లి గ్రామంలోని మా స్వగృహం నందు పెద్దకర్మ జరుగును.

ఇద్దరు కుమార్తెలతో కలిసి..

తల్లి ఆత్మహత్యాయత్నం

- వేగంగా స్పందించి వారి ప్రాణాలు కాపాడిన ఎస్ఐ

ప్రజాశక్తి-బాపట్ల, బాపట్ల జిల్లా

ఇద్దరు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్య ప్రయత్నించగా.. వెంటనే గుర్తించిన వెదుళ్లపల్లి ఎస్ఐ వేగంగా స్పందించి. వారి ప్రాణాలను కాపాడిన ఘటన స్టూవర్టుపురం రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది.

వెదుళ్లపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల మండలం, తులసినగర్‌కు చెందిన లక్ష్మీ తిరుపతమ్మ తమ భర్త రామకృష్ణారెడ్డితో ఏర్పడిన కలహాల నేపథ్యంలో తమ ఇద్దరు కుమార్తెలను తీసుకుని ఆత్మహత్య చేసుకుందామని రైల్వే ట్రాక్ వద్దకు వచ్చింది. బాపట్ల-చీరాల ప్రధాన రహదారికి అత్యంత దగ్గరలో ఉన్న రైల్వే ట్రాక్‌పై ముగ్గురూ ఉన్నారు. ఆ మార్గంలో ప్రయాణించేవారు 112 కు సమాచారం అందడంతో తక్షణమే స్పందించిన వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజ్ తన సిబ్బందితో ట్రాక్ వద్దకు చేరుకుని తల్లీకూతుళ్లను రక్షించారు. వారిని తులసినగర్ గ్రామానికి తీసుకెళ్లి.. అక్కడ ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. వేగంగా స్పందించి ముగ్గురి నిండు ప్రాణాలను కాపాడిన వెదుళ్లపల్లి ఎస్సై భాగ్యరాజ్‌ని, వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ అభినందించారు.

తల్లీకూతుళ్లతో మాట్లాడుతున్న పోలీసులు

జనం నాడి దొరికిందా.?

(మొదటిపేజీ తరువాయి)

నుంచి విపరీతమైన స్పందన ఉందా? ప్రభుత్వంపై పూర్తిస్థాయిలో సంతృప్తి ఉందా? అనే దానిపై తర్జనభర్జన నడుస్తోంది. ఈ కార్యక్రమంతో ఏడాది తర్వాత మళ్లీ గ్రామాల్లోకి వెళ్లి ఇంటింటికీ తిరిగే అవకాశం వచ్చింది. ఇప్పటికే చేసిన పనులకు ప్రారంభోత్సవాలు ఇప్పుడే పెడుతున్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ సమస్యలు, వ్యక్తిగత అవసరాలపై జనం నుంచి వచ్చిన విన్నపాలకు అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. కొన్ని నోట్ చేసుకుంటున్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాదే కావడంతో ప్రస్తుతం ప్రభుత్వంపై వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో స్పష్టంగా తెలియడం లేదు. జనం ఎక్కడా బయటపడటం లేదు. వ్యతిరేకంగా మాట్లాడితే స్థానిక నేతలతో ఇబ్బందులు వస్తాయనే భయం కూడా లేకపోలేదు. అయితే ఆశగా ఉన్నారు. ఎదురుచూపులు కనిపిస్తున్నాయి. ఎందుకంటే మేనిఫెస్టోలో చెప్పినవి ఇంకా చాలా మిగిలే ఉన్నాయి. ప్రతి మహిళకూ రూ.1500, అన్నదాతకు పెట్టుబడి సాయం, నిరుద్యోగ భృతి వంటివి అమలు కాలేదు. వాటి కోసం ఆయా వర్గాల్లో ఏడాదిగా ఎదురుచూపులే మిగిలాయి. ఇక అభివృద్ధి పరంగా అసంతృప్తి ఉంది. నిధుల్లేక ఆశించిన వేగంగా పనులైతే జరగడం లేన్నది వాస్తవం. జిల్లాస్థాయిలో ఇచ్చిన హామీలు కూడా అమలు కాలేదు. మార్కాపురం జిల్లా ఏర్పాటుపై పదేపదే హామీలు ఇస్తున్నారు. ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. పశ్చిమ ప్రాంతంలో దీనిపై గట్టి ఆశలున్నాయి. పాలకపక్షనేతలు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోలేదనే చర్చ సాగుతోంది. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులు ఏడాదిగా ప్యాకేజీలు, పునరావాసం కోసం ఎదురుచూస్తున్నారు. వారంతా ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. ఇక పార్టీ క్యాడర్ కూడా అన్నీ పక్కనబెట్టి కదిలింది. ఆదాయాలు లేక క్యాడర్‌లోనూ కొంత నిస్తేజం ఉంది. ఇప్పుడు అనివార్యంగా ఎమ్మెల్యేల కోసం ముందుకు వస్తున్నారు. ఏదేమైనా గ్రామాల్లో ఏడాది క్రితం ఓటేసిన ఓటర్ల స్పందన తమ ప్రభుత్వంపై ఎలా ఉందో తెలుసుకునే అవకాశం అనివార్యంగా పాలకపక్ష నేతలకు వచ్చింది. తమ పరిస్థితి ఎలా ఉందో నేతలకు సుస్పష్టంగా తెలుస్తోంది.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం..

ప్లాస్టిక్ కవర్ల తనిఖీలో కమిషనర్ నారాయణరావు

ప్రజాశక్తి మార్కాపురం

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తనిఖీ చేశారు. ఇకపై ఒక్కసారి ఉపయోగించే ప్లాస్టిక్ కవర్ల విక్రయం, వాడకంపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులు కూడా వ్యాపారులకు సహకరించాలన్నారు. కవర్ల విషయంలో పద్ధతి మార్చుకోని పక్షంలో కేసులు నమోదు చేయక తప్పదని హెచ్చరించారు. ప్లాస్టిక్ వాడకం పూర్తి స్థాయిలో నిరోధించేంత వరకు తనిఖీలు ఉంటాయని హెచ్చరించారు. కవర్ల స్థానంలో ప్రత్యామ్నాయం చూసుకోవాల్సిందేని సూచించారు.

కౌలు కార్డులివ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

అవలంబిస్తుంది తప్ప తక్షణ పరిష్కార చర్యలు చూపడం లేదన్నారు. నెల రోజులకు పైగా గడుస్తున్నా 20 శాతం పొగాకు కూడా కొనలేదని మిగతాది ఎప్పటికి కొంటారని ప్రశ్నించారు. చిన్న, సన్నకారు రైతులు తమ పొగాకు కొనడం లేదని ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, రుణ సౌకర్యం పెంచాలని, పంటల పరిస్థితి బాగా లేనందు వల్ల పంట రుణాలు వాయిదా వేసి వడ్డీలు రద్దు చేయాలని కోరారు. పొగాకు రైతులకు సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి టి.రామారావు, సిఐటియు నాయకులు ఎన్.బాబూరావు, కౌలురైతు సంఘం నాయకులు సురేష్ మాట్లాడారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. మహాసభలో గ్రామ నాయకులు ద్రాక్షారం శ్రీను, సిహెచ్ హనుమంతరావు, ద్రాక్షారామం ఏడుకొండలు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జి. నాగరాజు, పి. కొండయ్య

మహాసభలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.. అధ్యక్షులుగా గోల నాగరాజు, ఉపాధ్యక్షులుగా సిహెచ్.గంగయ్య, పి.ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శిగా పి.కొండయ్య, సహాయ కార్యదర్శులుగా భానుప్రసాద్, ప్రేమయ్య, జిల్లా కమిటీ సభ్యులుగా కూరాకుల రాజేష్, పి.శ్రీనివాసరావు, టిఎస్ ఐఆర్ రమేష్, పవన్‌కుమార్, సురేష్, ఆర్ వినోద్, చావా కోటేశ్వరావును ఎన్నుకున్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్

సంతనూతలపాడులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి-సంతనూతలపాడు: సంతనూతలపాడు అంబేద్కర్ నగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' ఇంటింటా టిడిపి కార్యక్రమంలో సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్‌కు అంబేద్కర్ నగర్ వాసులు ఘన స్వాగతం పలికారు. మొదట స్థానిక అంబేద్కర్ కమ్యూనిటీ హాలులోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే బిన్ విజయ్ కుమార్, గ్రామ మాజీ సర్పంచ్, బాపట్ల పార్లమెంట్ టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముందంజలో ఉన్నట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ పేర్కొన్నారు. మాజీ సర్పంచి రంపతోటి అంకారావు ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ మహిళలు ఎమ్మెల్యే విజయ్ కుమార్‌కు పూలాభిషేకం చేశారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తన్నీరు శ్రీనివాసరావు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్ బాబు, టిడిపి నాయకులు షేక్ నాయబ్ రసూల్, గ్రామ మాజీ సర్పంచ్ చెరువు సంఘం అధ్యక్షులు మన్నం రంగనాయకమ్మ, మండల టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. సంతనూతలపాడు, మద్దిపాడు సబ్ ఇన్‌స్పెక్టర్లు వేజెండ్ల అజయ్‌బాబు, శివరామయ్య, పోలీస్ సిబ్బంది శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

పేరుకే ఆర్‌టీసీ బస్టాండ్

ఒక్క బస్సూ పాయింట్లోకి రాదు

బస్టాండ్ పాయింట్‌లోకి రాకుండా కర్నూలు రోడ్డుపైనే ఆగిన బస్సు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు ఆర్టీసీ బస్టాండ్ పేరుకే ఉంది కానీ ఒక్క బస్సు కూడా ఆర్టీసీ పాయింటులోకి రావడం లేదు. బస్సులన్నీ ఆర్టీసీ బస్టాండ్ ముందు ఉన్న ఒంగోలు-కర్నూల్ రహదారిపై కొన్ని నిమిషాలు పాటు ఆగి ప్రయాణికులని ఎక్కించుకొని వెళ్తుంటాయి. సంతనూతలపాడులో ఆర్టీసీ బస్సులు ఎక్కాలంటే ప్రయాణికులు బస్టాండ్ విడిచి ఎదురుగా ఒంగోలు-కర్నూలు రహదారి మార్జిన్ ప్రాంతంలో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల ప్రయాణికులు బస్సు కోసం ఎండలో వేచి ఉంటున్నారు. ఫలితంగా కొందరు పెద్దలు ఎండవేడిమికి తట్టుకోలేక పోతున్నారు. ప్రస్తుతం సంతనూతలపాడు ఆర్టీసీ బస్టాండ్ లీజు పద్ధతిలో కొనసాగుతోంది. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో ఫ్యాన్లు ఉన్నాయి. కానీ అవి తిరగవు. దీంతో ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ఒంగోలు, చీమకుర్తి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు బస్టాండు పాయింట్లోకి వచ్చేటట్లు చర్యలు తీసుకోవలసిందిగా పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ గారి కోర్టులో

O.S. 250 / 224

బిట్వీన్:
కురుగండ్ల శ్రీనివాసరావు ...వాది

వర్సెస్

అడుసుమల్లి వెంకట నరసయ్య ...ప్రతివాది

To:
ప్రతివాది: అడుసుమల్లి వెంకట నరసయ్య.
S/o. సుబ్బారావు, మేదరమెట్ల గ్రామం, కొరిసపాడు మండలం, బాపట్ల జిల్లా.

పై తెలిపిన దావాలో మీరు ప్రతివాదై ఉన్నారు. కోర్టు వారు పలు పర్యాయములు నోటీసుల ద్వారా తెలియ జేసియున్నారు. కానీ మీరు కోర్టు నోటీసులను తీసుకో నందున కోర్టు వారు పత్రిక ప్రకటన ద్వారాతెలియజేసి యున్నారు. వాయిదా తేదీ: 24-7-2025న మీరు గాని, మీ తరుపున వకీల్ ద్వారా గాని ఉదయం గం.10:30 ని॥లకు కోర్టులో హాజరు కావలసి ఉన్నది. లేనియెడల మీ పరోక్షముగా తీర్పు చెప్పేదరు. ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా 24-7-2025. **ఇట్లు**

గుడాల అంజిరెడ్డి,
వాది తరపు న్యాయవాది,
అద్దంకి.

రిజిస్ట్రేషన్ దస్తావేజులు పోయినది

మార్కాపురం మండలంలోని వేములకోట గ్రామ కాపురస్తురాలు జి.శారదాంబకు సంబంధించిన వేములకోట పరిధిలోని ఒరిజినల్ రిజిస్ట్రేషన్ దస్తావేజులు పోయినవి. దస్తావేజు నెం: 1070/2019 జిరాక్స్ తీయించుకునేందుకు పట్టణంలోని నెహ్రూ బజారుకు వెళ్లగా జారిపోయినవి. ఎంత వెతికినా కనిపించలేదు. ఎవరికైనా దొరికినయెడల తమకు అందజేయగలరని మనవి.

జి.శారదాంబ,
సెల్: 6303042437.

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.NO: 200/2025
I.A.NO :82/2017
O.S NO : 20/2004

మారం రాజేశ్వరి ...పిటిషనర్

మరియు

కాకాని రంగారావు (Died) వగైరా ...రెస్పాండెంట్స్

To:
8వ రెస్పాండెంటు :
పేర్ని పార్వతి, W/o. ఆంజనేయులు,
D/o. కాకాని రంగారావు, R/o. కోరిశపాడు గ్రామం (మండలం), బాపట్ల జిల్లా.

నోటీసు

పై నెంబరు పిటీషనరు పై నెంబరు పిటీషన్ను ఆర్డరు 22 రూలు 4 సి.పి.సి. ప్రకారం చనిపోయిన 1వ రెస్పాండెంటుకు మిమ్మలను వారసులుగా చేర్పించమని దాఖలు చేసినందున సదరు పిటీషనులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ అవి జారీ కాబడి ఉండలేదు. కావున శ్రీయుత కోర్టు వారి అనుమతితో మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసును జారీ చేయడమైనది. యిందు నిమిత్తం మీకు ఏమైనా అక్షేపణలు ఉన్న ఏడల తేది.31/07/2025 ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనెది. లేని ఏడల పై విషయమును మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

(శ్రీయుత కోర్టువారి అనుమతితో)

వాయిదా తేది 31.7.2025
అద్దంకి,
తేది :20-7-2025 **ఇట్లు**

పంచాగ్నుల రమేష్
పిటిషనరు తరుపు అడ్వకేటు.
అద్దంకి, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్
సెల్ నెం : 9948788290

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I. A. No: 383/2024
I. A. No: 384/ 2024 &
I. A. No: 385/2024
IN
A. S. No: 2/2021

రావిపాటి వెంకటేశ్వర్లు వగైరా ...పిటీషనర్లు / అప్పిలెంట్లు

And

రావిపాటి పిచ్చియ్య (డైడ్) వగైరాలు ...రెస్పాండెంట్లు

నోటీసు

To :
R11 : సయింపు దత్త పవన్, తండ్రి ప్రసాద్ నాగన్నపాలెం, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా.

1) I. A No: 383/2024
పై నంబరు అప్పిలు లోని ఏడవ రెస్పాండెంట్ సయింపు కోటేశ్వరమ్మ చనిపోయిన కారణముగా ఆమెకు వారసులుగా మిమ్ములని మరి కొంతమందిని సమయములోపు చేర్చలేకపోవడం వలన అప్పీలు సదరు ఏడవ రెస్పాండెంట్ పై ఏ బెటు చేయగా సదరు ఉత్తర్వులను రద్దు చేయమని కోరుటలో జరిగిన ఆలస్యమను క్షమించమని కోరుచూ పై నెంబర్ పిటిషన్ దాఖలు చేయడమైనది.

2) I. A. No: 384/2024
సదరు ఏడవ రెస్పాండెంట్ పై ఉన్న ఎబెట్ మెంట్ రద్దు చేయమని కోరుచూ పై నెంబర్ పిటిషన్ దాఖలు చేయడమైనది.

3) I. A. No: 385/2024
చనిపోయిన ఏడవ రెస్పాండెంట్‌కు వారసులుగా నిన్ను మరి కొంతమందిని పై అప్పీలులో రెస్పాండెంట్లుగా చేర్చమని కోరుచూ పిటిషన్ దాఖలు చేయడమైనది. పై మూడు పిటిషన్లు మీ నోటీసు నిమిత్తం తేది 28.7.2025 కి వాయిదా వేసినారు. కోర్టు వారి ఆదేశములు ప్రకారం మీకు నోటీసు ఈ ప్రకటన ద్వారా పంపడమైనది. కావున పై తేదీన అనగా 28.7.2025 న పై కోర్టు ఎదుట ఉదయం 10:30 నిమిషములకు హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనగలరు. లేనిచో పిటిషన్లు మీ పరోక్షమందు తీర్మానం కాగలవు.

(శ్రీయుత కోర్టువారి అనుమతితో)

ఇట్లు
వెలగపూడి సుబ్రహ్మణ్యం
పిటిషనర్ల తరపు న్యాయవాది
అద్దంకి, బాపట్ల జిల్లా.

దావా సమను

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 260/2024

బిట్వీన్ :-
లంకా వెంకట శేషయ్య ...వాది

V/s

ముప్వల సుబ్రహ్మణ్యం ...ప్రతివాది

To:
ముప్వల సుబ్రహ్మణ్యం S/o. ఆంజనేయులు ,
పర్చూరు గ్రామం మరియు మండలం, బాపట్ల జిల్లా

అను మీకు పై వాది దాఖలు చేసిన ప్రో నోటు బాకీ మొత్తం ను మీ నుండి రాబట్టుకొనుటకు వేసిన దావాలో మీ అడ్రస్ కు అనేకసార్లు ఈ దావా సమన్లు పంపిననూ చేరక తిరిగి వచ్చుచున్నందున ఈ పత్రిక ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పైకోర్టులో వాయిదా ది. 24-07-2025 న ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు .

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా : 24-07-2025
పర్చూరు
తేది: 20-07-2025 **ఇట్లు**

ఒగ్గిశెట్టి గోవిందరాజులు
వాది తరపు న్యాయవాది
పర్చూరు
Cell No: 9866806098

దావా సమను

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 38/2025

బిట్వీన్ :-
ముప్వల వెంకట రామ సుబ్రమణ్యం ...వాది

V/s

ముప్వల సుబ్రమణ్యం ...ప్రతివాది

To:
ముప్వల సుబ్రమణ్యం, S/o. ఆంజనేయులు,
పర్చూరు గ్రామం మరియు మండలం, బాపట్ల జిల్లా.

అను మీకు పై వాది దాఖలు చేసిన ప్రో నోటు బాకీ మొత్తంను మీ నుండి రాబట్టుకొనుటకు వేసిన దావాలో మీ అడ్రస్ కు అనేకసార్లు ఈ దావా సమన్లు పంపిననూ చేరక తిరిగి వచ్చుచున్నందున ఈ పత్రిక ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై కోర్టులో వాయిదా ది. 23-07-2025 న ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

వాయిదా :- 23-07-2025
పర్చూరు
తేది: 20-07-2025 **ఇట్లు**

యార్లగడ్డ వెంకటేశ్వరరావు
వాది తరపు న్యాయవాది
పర్చూరు
Cell no: 9985534996

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. 2/2023

గజ్జలకొండ వెంకటమ్మ మరియు ఒకరు ...వాదులు

వర్సెస్

పల్లంశెట్టి వెంకట సుబ్బమ్మ మరియు ఇతరులు ...ప్రతివాదులు

టు,
డి-14: పగడాల సుజాత, భర్త: శ్రీను,
తల్లి: సవరం పిచ్చమ్మ,
నివాసం: తాళ్లపల్లి గ్రామం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.
డి-19: గజ్జలకొండ వేంకటేశ్వరరావు,
తండ్రి: లక్ష్మయ్య, నివాసం: డోర్ నెంబర్: 1/59, మెయిన్ రోడ్, కొమరోలు గ్రామం,
కోమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

వాదులు పై నెంబర్ దావాను భాగ పరిష్కార నిమిత్తం పై కోర్టునందు దాఖలు చేసి ఉన్నందున ఆ దావాలో మీకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీకు చేరనందున మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు తేది: 01-08-2025 కి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా లాయరు గారి ద్వారా గానీ శ్రీ కోర్టు వారి ముందు హాజరై పై కేసులో మీ అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 01-08-2025.

జి.ఎన్.నవీన్ కుమార్,
న్యాయవాది, మార్కాపురం,
ప్రకాశం జిల్లా.
సెల్ నెం. 9000450215.

ప్రజాశక్తి
సోమవారం 21 జూలై 2025

జగన్ పాలనలో రవాణా రంగం కుదేలు

గ్రీన్ టాక్స్ తగ్గించడంపై మంత్రిని సత్కరించిన లారీ ఓనర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-టంగుటూరు

కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నామని, ఇచ్చిన మాట ప్రకారం గ్రీన్ టాక్స్ తగ్గించామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రవాణా వాహనాలపై గ్రీన్ టాక్స్ (హరిత పన్ను) తగ్గించినందుకు గానూ ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో సింగరాయకొండ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి స్వామిని కలిసి ప్రభుత్వానికి కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని గజమాలతో సత్కరించారు. మంత్రి డాక్టర్ స్వామి మాట్లాడుతూ వైసీపీ హయాంలో వాహనదారులపై రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచి మోయలేని భారం మోపిందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మంత్రిని కలిసి కతజ్ఞతలు తెలిపిన వారిలో ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సింగరాయకొండ లారీ అసోసియేషన్ అధ్యక్షులు చిగురుపాటి శేషగిరి, కార్యదర్శి పటేల్, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

శింగరాయకొండలో పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

చిత్రపటాలకు పాలాభిషేకం

శింగరాయకొండ: శింగరాయకొండ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద గ్రీన్ టాక్స్ తగ్గించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య చిత్రపటాలకు లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిగురుపాటి శేషగిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి రవాణా రంగానికి ఎంతో ఊరట లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు ఎస్కె.పటేల్, శీలం రమణయ్య, పామర్తి మాధవరావు పాల్గొన్నారు.

మంత్రి స్వామిని సత్కరిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

ప్రజాశక్తి-కనిగిరి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని పునరుద్ధరించి పెండింగ్ క్లెయిమ్స్‌ని పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం.రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కనిగిరి సుందరయ్య భవనంలో బి.రోశయ్య అధ్యక్షతన ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రకాశం జిల్లా 6 వ మహాసభ జరిగింది. ఈ మహాసభలో రమేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని పునరుద్ధరించి సంక్షేమ పథకాలన్నీ కార్మికులకు అమలుచేస్తామని వాగ్దానం చేసిన టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా నేటకీ నేరవేర్చలేదన్నారు. ఉచిత ఇసుక నేటికి అందుబాటులోకి రాలేదన్నారు. ఇదేదోరణితో ప్రభుత్వం ఉంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లానాయకులు టి.ఆవులయ్య మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.సి.కేశవరావు మాట్లాడుతూ బిల్డింగ్ కార్మికులను టిడిపి కూటమి మోసం చేసిందన్నారు. ఇసుక సమస్య ఉపాధిని దెబ్బ తీస్తుందన్నారు. ప్రమాధంలో గాయపడిన, మరణించిన కుటుంబాలు అనాథలవుతున్నట్లు తెలిపారు. 60 సంవత్సరాలు నిండిన కార్మికులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ మహాసభలో ఎపి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లాప్రధానకార్యదర్శి యన్.రామారావు, జిల్లా నాయకులు బి. నరసింహులు, థామస్, యస్. కె. వలి, యస్. కె. నాగూర్, యస్ కె.అన్వర్, రామయ్య, నాగార్జున, యన్.శ్రీను, యస్.కె.లాల్ బిసిఐటియు జిల్లా నాయకులు కె.మాల్యాద్రి, ఆర్.మాలకొండయ్య, పి.నరేంద్రలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

ఇళ్లలోకి చేరిన వాన నీరు

శింగరాయకొండలో భారీ వర్షం

ప్రజాశక్తి-శింగరాయకొండ

తుఫాను ప్రభావంతో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. శింగరాయకొండ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి అయినప్పటికీ వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. సోమరాజు పల్లి చెరుకు వెళ్లే కాలువ ఉధృతంగా పారుతోంది. తిరుమల పట్టాభి నగర్, అప్పాపురంలో వర్షపు నీరు రోడ్లు పైకి వచ్చింది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో టీడీపీ గ్రామ అధ్యక్షుడు శీలం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వర్షపు నీటిని బయటకు పంపే చర్యలు తీసుకున్నారు.

నేడు పిఎసిఎస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పీసీపల్లి

నేడు పిఎసిఎస్ చైర్మన్ మరియు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్లు చైర్మన్ పరిమి ఈశ్వరయ్య తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు పిసీపల్లి సొసైటీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. మరో ఇద్దరు డైరెక్టర్లు ఉండేల పిచ్చిరెడ్డి, దింటకుర్తి సుబ్రమణ్యం కూడా ప్రమాణస్వీకారం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కొత్తపట్నం

మండలంలోని అల్లూరులో ఆదివారం మండపం సెంటర్లో డాక్టర్ చాపల వంశీకృష్ణ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మేడా శ్రీనివాసరావు ప్రారంభించారు. హాస్పిటల్ ఎండీ, డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ శిబిరంలో పాల్గొన్న వారికి శ్రీరామ్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో నెల రోజుల పాటు ఉచిత ఓపి, పరీక్షలపై రాయితీ ఇవ్వబడుతుందని తెలియజేశారు. శిబిరంలో 320 మందికి బిపి, షుగర్, ఈసీజీ, పాదాల నరాల స్పర్శ పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందించారు. శిబిరంలో ప్రముఖ ప్రసూతి మరియు స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ చాపల శాంత కుమారి, వైద్యులు సానల ధీరజ్‌బాబు, షేక్ వలీబాబు, సజన్, కొప్పోలు సౌమిత్ర పల్లవ్, నందలూరు సరయు, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గోపి, అనిల్, రజనీకాంత్ పాల్గొన్నారు.

వైద్య సేవలందిస్తున్న డాక్టర్ చాపల వంశీకృష్ణ

హోదా పక్కనెట్టి.. సిబ్బందితో చేయి కలిపి..

స్వయంగా చెత్తను తొలగించిన కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీలో ఐదు రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మెలో కొనసాగుతున్నారు. ఈ క్రమంలో విధులన్నీ అపరిశుభ్రంగా మారాయి. దీంతో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తనవంతుగా కృషి చేసేందుకు మున్సిపల్ కమిషనర్ పి.కృష్ణమోహన్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. ఆదివారం కమిషనర్ తన హోదాను పక్కన పెట్టి మున్సిపల్ సిబ్బందితో కలిసి కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండులోని చర్చి సెంటర్ వద్ద గల కరెంటు వైర్లు, కమిషనర్ స్వయంగా తొలగించారు. పరిసరాలలోని చెత్తను శుభ్రం చేయించారు. శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు శుభ్రపరచిన కొత్తూరు అలుగు ప్రదేశాన్ని పునఃపరిశీలన చేశారు. ఇక మీదట ఆ పరిసరాలను అపరిశుభ్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక 8వ వార్డులోని ప్రజల నీటి సమస్యను తీర్చడం కోసం స్వయంగా కమిషనరు వాటర్ ట్యాంకును అమర్చి ఆ ఏరియా ప్రజల అవసరాలను తీర్చారు. ఏరియాలోని డ్రైనేజ్ మరియు స్ట్రీట్ లైట్ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకుని రాగా ప్రస్తుతం జరుగుతున్న కార్మికుల సమ్మె విరమించగానే యుద్ధ ప్రాతిపదకన పనులు చేయిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి కమిషనర్ స్వయంగా పనులు చేస్తూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయడంతో ప్రజలు ఆయనను అభినందిస్తున్నారు.

కరెంటు వైర్లు తొలగిస్తున్న కమిషనర్

ఇష్టం లేని కోర్సు చేయమన్నారని..

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-కంభం : ఇష్టం లేని కోర్సు చేయమని తల్లిదండ్రులు బలవంతం చేయడంతో విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కంభంలో ఆదివారం జరిగింది. కంభంలోని రహమత్ నగర్ 2వ లైన్లో నివాసం ఉంటున్న కుంచాల అంజనీ కమల్ (18) జేఈఈలో కోచింగ్ తీసుకొని చదువుతానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. కానీ తమిళనాడులోని పాలిటెక్నిక్ కాలేజీలో ఉచితంగా సీటు రావడంతో పాలిటెక్నిక్ చదవాలని కుటుంబ సభ్యులు కమల్‌కు తెలిపారు. పాలిటెక్నిక్ చదవడం ఇష్టం లేని కమల్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కమల్ మృతదేహం

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

భర్త మృతి.. భార్యకు గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఆగి ఉన్న లారీని మోటార్ బైక్ ఢీకొన్న ఘటనలో భర్త మృతి చెందగా భార్య గాయపడిన సంఘటన మండలంలోని కలికివాయ జాతీయ రహదారి పరిధిలోని బికే త్రెస్సింగ్ కంపెనీ ఎదుట ఆదివారం జరిగింది. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం పలుకూరు గ్రామానికి చెందిన ఎస్కే సుభాని భాష (40) మోటార్ బైక్ మీద తన భార్యతో వస్తు లారీని ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయం తగలడంతో 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తమ కుమార్తెకు ట్రిపుల్ ఐటీలో సీటు రావడంతో తెలంగాణలోని బాసరలో ఉన్న కళాశాలలో చేర్పించి, వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సుభాని భాషా పలుకూరులో టైలరింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కూతుర్ని కళాశాలలో వదిలిపెట్టి ఇంటికి వెళుతున్న సమయంలో ఇలా గాయపడి ఆసుపత్రికి వెళ్లే సమయంలోనే మతి చెందడంతో అతని భార్య బోరున విలపిస్తుంది.

గాయపడిన సుభాని

వ్యక్తిపై యువకుల దాడి

ప్రజాశక్తి-కొండపి

పెట్రోల్ బంకులో పంపు బాయ్‌గా పనిచేస్తున్న ఇనుకొల్లు శేషయ్యపై యువకులు దాడి చేసిన సంఘటన మండలంలోని స్థానిక భారత్ పెట్రోల్ బంకులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు ఇనుకొల్లు శేషయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి నలుగురు యువకులు రెండు బైక్‌లపై వచ్చి పెట్రోలు కొట్టించుకొని డబ్బులు ఇవ్వమని అడగ్గా ఫోన్ పే చేశామని పెద్ద కళ్ళగుంట గ్రామానికి చెందిన దాచర్ల సుమంత్ చెప్పాడు. చూపించమని అడగ్గా మద్యం మత్తులో ఆ యువకుడు, వారి స్నేహితులు పిడుగుద్దులతో దాడి చేశారు. కింద పడి లేచిన శేషయ్యను మళ్లీ పిడుగుద్దుల వర్షం కురిపిస్తూ దాడి చేశారు. ఈ దాడిలో శేషయ్య తీవ్ర గాయాల పాలై స్పృహ కోల్పోయాడు. స్థానికులు శేషయ్యను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో చికిత్స చేయించారు. అనంతరం ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. ఈ విషయంపై ఎస్సై ప్రేమ్ కుమార్‌ను వివరణ కోరగా వచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాడి చేస్తున్న యువకులు

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-టంగుటూరు : టంగుటూరులోని బుచ్చిరాజుపాలెం సమీపంలోని చిల్లచెట్లలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రోన్ కెమెరా సాయంతో ఎస్ఐ వి.నాగ మల్లీశ్వరరావు నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.14,840 స్వాధీనం చేసుకున్నారు.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని డ్రోన్ సహాయంతో పట్టుకొని వారిని కట్టడి చేస్తామని ఎస్ఐ తెలిపారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నాగమల్లీశ్వరరావు తెలిపారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - అద్దంకి

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆండ్రా మాల్యాద్రి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగుతున్న కార్మికుల సమ్మె శిబిరాన్ని ఆయన ఆదివారం సందర్శించి మద్దతు తెలిపారు. గత ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుండా దుర్మార్గ వైఖరి అవలంబించిందని, అదే విధానాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అవలంబిస్తుందని అన్నారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. టిడిపి అధికారంలో ఉండగా ఇచ్చిన జిఒ 36 అమలు చేయాలని అన్నారు. చిత్తశుద్ధితో కార్మిక సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. రోజువారి అవసరమైన నిత్యవసర వస్తువులు గణనీయంగా పెరిగాయని, కార్మికులు జీవన స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని అన్నారు. పెరిగిన నిత్యవసరాలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాల్సింది పోయి ప్రభుత్వం కాలయాపన చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి వెంటనే కార్మికులతో చర్చలు జరిపి సమ్మె విరువంప చేయాల్సిన బాధ్యత ఉందని అన్నారు. అలా చేయని పక్షంలో సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి ఆదాం, ఐలు నాయకులు డి గంగాధర్, ఇంజనీరింగ్ భాగం నాయకులు ఉసురు పాటి శామ్యూల్, జి మార్కు, కె మారుతి, డి జాషువ, ఎం కోటేశ్వరరావు, ఎం రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంధ్ర మాల్యాద్రి

ఎమ్మెల్యే కొండయ్యకు స్వాగతం పలుకుతున్న నాయకులు

పందిళ్లపల్లి అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్ళపల్లి గ్రామ అభివృద్ధికి సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తానని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. పందిళ్ళమ్మ అమ్మవారి సంబరాల సందర్భంగా ఆదివారం పొంగళ్ళు, మొక్కులు చెల్లించుకునే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ పెద్దలు, స్థానిక నాయకులు ఆయనను సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. రాబోయే రోజుల్లో పందిళ్ళపల్లి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు కోలా రామయ్య, రెండా సత్యనారాయణరెడ్డి, తిరుమల శ్రీనివాసరావు, తిరుమల సాంబయ్య, ఆనాల నరసింహారావు, పల్లపోలు శ్రీనివాసరావు, నాసిక వీరభద్రయ్య, పోలకం చంద్రశేఖర్, పెరిసెట్ల బాలచంద్ర, నాశిక మల్లేశ్వరరావు, గుత్తి లింగమూర్తి, నరహరి, శివయ్య, కడెం జయశంకర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

340 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పంగులూరు

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఒంగోలు ఉపాస్ హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాల్లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిభిరంలో 340 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు శిబిరం కోఆర్డినేటర్ తాళ్లూరి రామాంజనేయులు తెలిపారు. డాక్టర్ జగదీష్ బాబు, డాక్టర్ జి శ్రీనివాస్, డాక్టర్ వి జయవర్ధన్ రోగులకు అవసరమైన సాధారణ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఒక వారం రోజులు సరిపడా మందులు ఉచితంగా అందజేశారు. వీరిలో 22 మందిని మెరుగైన వైద్య పరీక్షల కోసం ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఒంగోలులోని ఉపాస్ హాస్పిటల్‌కు సిఫార్సు చేశారు. ఉపాస్ హాస్పటల్ జనరల్ మేనేజర్ ఆనంద్, హాస్పిటల్స్ పిఆర్ఒ ఇస్లాం, హాస్పిటల్స్ సిబ్బంది, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పూసపాటి సాంబశివరావు, యువ నాయకులు కోళ్లపూడి సురేష్ బాబు, విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు చేబ్రోలు రవిచంద్రచారి, ఉపాధ్యక్షులు కందుకూరి మల్లికార్జున్, మాజీ జెడ్పిటిసి కరి వెంకటసుబ్బారావు, నాయకులు శ్రీనివాసచారి, జెడ్పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సోమేపల్లి శ్రీనివాసరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, మేడూరి ప్రసాద్ పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానం సాధించిన జట్టు

షటిల్ ప్రథమ స్థానంలో గుడిమెట్ల జట్టు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ మీట్ 50ప్లస్ మెన్స్ డబుల్స్ విభాగంలో గుడిమెట్ల శ్రీమన్నారాయణ, శీలం వినయకుమార్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. మండల సమైక్య ఎపిఎంగా పనిచేస్తున్న శ్రీమన్నారాయణ ఈపాటికే బ్యాడ్మింటన్‌లో అనేక పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించారు. ఆదివారం జరిగిన పోటీల్లో శ్రీమన్నారాయణ జోడి ఎస్‌కె సింగారయ్య, ప్రత్తిపాడు సిఐ శ్రీనివాసరావు జోడిపై ఫైనల్స్‌లో గెలుపొంది జిల్లా ప్రథమ స్థానం సాధించినట్లు శ్రీమన్నారాయణ తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - బట్టిప్రోలు

గత 25ఏళ్లుగా భట్టిప్రోలు, అద్దేపల్లి పద్మశాలియ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. స్థానిక పద్మశాలీయ కళ్యాణ మండపంలో 25వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆదివారం పుస్తకాల పంపిణీ చేశారు. వార్షికోత్సవ సభకు బట్టు మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. సభలో ఆనందబాబు మాట్లాడుతూ గత ఎన్నికల్లో పద్మశాలీలకు ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేరుస్తానని చెప్పారు. భట్టిప్రోలులో జరిగిన అభివృద్ధి తెలుగుదేశం పాలనలో మాత్రమే జరిగిందని అన్నారు. టిడిపి గతంలో కూడా గ్రామానికి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని అన్నారు. 10వ తరగతి పరీక్షల్లో 500పైగా మార్కులు సాధించిన 15 మంది విద్యార్థినీ, విద్యార్థులకు టిడిపి నాయకులు గాత్రం భావనారాయణ రూ.30వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి మురుగు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పనితపు శివ నాగేశ్వరరావు, జడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కౌతరపు పిచ్చయ్య శాస్త్రి, నాయకులు బాలాజీ, కుమారస్వామి పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ఆవోపా చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - చీరాల

సమాజ సేవలో భాగంగా పేద విద్యార్థులను గుర్తించి వారికి ఆర్థికంగా చేయూతనిస్తూ, అవసరమైన విద్యా సామాగ్రి అందజేసిన ఆవోప నిర్వాహకులు వలేటి మురళీకృష్ణ, దాతల సేవలు అభినందనీయమని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. స్థానిక కిరాణా మర్చెంట్స్ కళ్యాణ మండపంలో అవోపా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చదువుల పండుగ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన 109 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, 80 మంది విద్యార్థులకు వడ్డీలేని విద్యా రుణాలు, 64 మందికి ఉచిత చేయూత పురస్కారాలు, 40మందికి వడ్డీలేని ఉపాధి రుణాలు అందజేశారు. ఐదుగురు విద్యార్థులకు వడ్డీలేని రుణంగా ల్యాప్టాప్, కంప్యూటర్లు అందించారు. 250మంది ఆర్యవైశ్య విద్యార్థులకు రూ.25 లక్షల విలువైన సహాయం అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కొత్తమాసు శివ రంగనాయకులు, మువ్వల వెంకట రమణారావు, బొలిశెట్టి మురళీకృష్ణ, బొలిశెట్టి రమేష్ కుమార్, పోలిశెట్టి ప్రేమ్ కుమార్, అవోపా అధ్యక్షుడు పోలిశెట్టి శ్యామసుందరరావు, కార్యదర్శి పేర్ల వెంకటరామయ్య పాల్గొన్నారు.

మురుగు కాల్వల్లో పూడిక తీయించాలి

ప్రజాశక్తి - భటప్రోలు

మండల పరిధిలోని కనగాల అప్లోయెంట్ మురుగు కాలువలో పేరుకు పోయిన గుర్రపు డెక్క తొలగించి, పూడిక తీత చేపట్టి కాలువ గట్లు ఆధునికరించాలని భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల రైతులు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు దృష్టికి ఆదివారం తీసుకువచ్చారు. ఆయన క్యాంపు కార్యాలయంలో టిడిపి శ్రేణులు, రైతులతో కలిసి పలు విషయాలు వివరించారు. భట్టిప్రోలు నుంచి గూడవల్లి, గంగోలు వరకు మూడు కిలోమీటర్ల పరిధి ఉన్న ఈ మురుగు కాలువ తూటికాడ, గుర్రపు డెక్క ఆకుతో పెన వేసుకుపోయి ఉన్నదని, దీని కారణంగా గతంలో వరి పొలాలు నీట ముంపు గురయ్యాయని వివరించారు. ఈ మురుగు కాల్వ ఆయకట్టు 3వేల ఎకరాల మాగాణి భూమికి విస్తరించి ఉందని, పంట పొలాలు ముంపుకు గురికాకుండా ఎప్పటి కప్పుడు మురుగు నీరు దిగువకు వెళ్ళిపోయే విధంగా తూటికాడ తొలగించాలని కోరారు. ఎమ్మెల్యే ఆనందబాబు అధికారులతో మాట్లాడి తక్షణమే మురుగు కాలువలో ఉన్న గుర్రపు డెక్క తొలగించి అభివృద్ధి పర్చే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఎడ్ల జయశీలరావు, టిడిపి నాయకులు అంజిబాబు, డొక్కు శ్రీనివాసరావు, వంగర వీరయ్య, కంభం సుధీర్, వేల్పూరి వెంకట్రావు, కొన్నిపాటి లోకానంద్, ఇర్ఫాన్ బేగ్, కుంచే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రైనేజీ పరిస్థితిని ఎమ్మెల్యేకు వివరిస్తున్న రైతులు

వర్షానికి జలమయమైన రహదారులు

భారీ వర్షంతో జలమయమైన రోడ్లు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అల్పపీడనం కారణంగా ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయం అయ్యాయి. మండలంలో వివిధ గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు వర్షానికి నీట మునిగాయి. వెల్లటూరు, భట్టిప్రోలు, ఐలవరం తదితర గ్రామాల్లో ప్రధాన రహదారుల్లో మోకాలి లోతుపైగా నీళ్ల నిలబడి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉండగా ఖరీఫ్ సీజన్లో రైతులు సాగునీరు విడుదల కానప్పటికీ వర్షంపై ఆధారపడి పలువురు వెద పద్ధతిన విత్తనాలు సాగు పెట్టారు. కురిసిన వర్షాలకు గింజలు సక్రమంగా మొలిచే అవకాశం ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం వెద పెట్టిన పంట పొలాల్లో కురిసిన వర్షం నిలబడి గింజ మొలక దశలో ఉండగా మురిగి పోయే ప్రమాదం కూడా లేకపోలేదని కొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు మరికొన్ని రోజులు ఇదే రీతిలో కురిస్తే మొలక దశలో ఉన్న గింజలకు నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు.

అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - వేటపాలెం

టిడిపి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని టిడిపి నాయకులు నాసిక వీరభద్రయ్య అన్నారు. మండలంలోని పందిళ్ళపల్లిలో 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవం ఉన్న నేతలు పరిపాలిస్తే ఎలా ఉంటదో రాష్ట్రంలో చంద్రబాబును, నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొండయ్యను చూస్తే తెలిసిపోతుందని ప్రశంసించారు. గ్రామంలో ఇంటింటికి టిడిపి నాయకులు వెళ్లి తొలి ఏడాది ప్రగతిని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం గ్రామ అధ్యక్షులు పేరిసెట్ల బాలచంద్ర, నాయకులు పల్లప్రోలు శ్రీనివాసరావు, గుత్తి లింగమూర్తి, గుత్తి కోటి వీరయ్య, మహిళా అధ్యక్షురాలు యర్రా శివ నాగ మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఏడాది పాలనపై కరపత్రాలు పంచుతున్న వీరబద్రయ్య

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

ప్రజాసమస్యలు సత్వరమే పరిష్కరించాలి

మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

గ్రామాల్లో పచ్చదనం, పారిశుధ్యాన్ని పెంపొందించాలని, ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. ఆదివారం నాడు టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ ఎంపీడీఓలు, ఎమ్మార్వోలతో మంత్రి స్వామి విడివిడిగా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రెవిన్యూ సమస్యలు, గ్రామాల్లో పారిశుధ్యం, వీధి లైట్లు వంటి ప్రజా సమస్యలపై మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతుల భూ సమస్యలు, ఆన్లైన్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. గ్రామాల్లో పచ్చదనం, పారిశుధ్యాన్ని పెంపొందించాలని, డ్రెయిన్లు,సైడ్ కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయాలని పేర్కొన్నారు. గ్రామాల్లోని అన్ని వీధుల్లో లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు ప్రజాసమస్యల పరిష్కారమే మొదటి ప్రాధాన్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని స్వామి అన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-టంగుటూరు

డా.బి.ఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్ కేంద్రాల ద్వారా పోటీ పరీక్షల కోసం నిరుద్యోగ ఎస్సీ,ఎస్టీ యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమం త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఆ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి కేంద్రాలుగా బ్యాంక్ పిఓ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ), రైల్వే రిక్రూట్మెంట్ (ఆర్ఆర్బి) పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ కోసం అభ్యర్థుల నుంచి త్వరలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ ఎస్సి, ఎస్టీ యువత వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

లయన్స్‌క్లబ్ అభివృద్ధికి సహకరిస్తా..

ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సేవా కార్యక్రమాలు మారుపేరుగా నిలిచిన లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ అభివృద్ధికి సహకరిస్తారని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు పేర్కొన్నారు. నగరంలోని విష్ణుప్రియ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం 37వ లయన్స్‌క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షులుగా పబ్బిశెట్టి రాజేష్, కార్యదర్శిగా నాగసూరి ఆనందబాబు, కోశాధికారిగా జె శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ సేవా కార్యక్రమాలు మరింత విస్తరింపజేయాలని సూచించారు. పేద విద్యార్థుల కోసం డిజేఆర్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఒంగోలు నగరంలో పార్కుల అభివృద్ధి, డివైడర్లు ఏర్పాటు, నగర సుందరీకరణతో పాటు మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఒంగోలు నగరం అభివృద్ధి చెందాలంటే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

పరిశ్రమలు, మాల్స్ రావాల్సిందన్నారు. ఒంగోలు నగరంలో పరిశ్రమలు మరింత వచ్చేందుకు వీలుగా ట్రంక్ రోడ్డు విస్తరణ చేపడుతున్నట్లు ఆయన తెలియజేశారు. రహదారి విస్తరణకు నగర ప్రజలు సహకరించాలని కోరారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఏ కార్యక్రమం చేపట్టిన తన సహాయ సహకారాలు ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్ ప్రతినిధులు చలువాది శ్రీహరి, కుమారస్వామి, నామినేని మోహన్‌రావు, విజయకుమార్‌రెడ్డి, వాసు, తాతా మధుసూదన్‌రావు, మాంటిసోరి హైస్కూల్ అధినేత ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

24న 'లాల్-నీల్ మైత్రి అవసరం'పై సదస్సు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

'సెక్యులర్ భారత రాజ్యాంగం-లాల్, నీల్ మైత్రి అవసరం' అనే అంశంపై ఈ నెల 24న ఒంగోలు మల్లయ్యలింగం భవనంలో సదస్సు జరుగనుందని డిహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు తెలిపారు. ఆదివారం నాడు స్థానిక సివిఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో కరపత్రం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో కమ్యూనిస్టులు (లాల్), అంబేద్కరిస్టులు (నీల్) కీలక పాత్ర పోషించారని, అందరికీ సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం కలిగిన రాజ్యాంగాన్ని అందించారని గుర్తుచేశారు. సదస్సుకు ప్రొఫెసర్ అబ్దుల్ నూర్ భాషా, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, చావలి సుధాకర్ రావు, న్యాయవాది ముప్పవరపు కిషోర్, పీకే రాజేశ్వరరావు తదితరులు ఉపన్యాసకులుగా పాల్గొంటారని తెలిపారు. వామపక్ష, దళిత, అభ్యుదయవాదులు, ప్రజలు విస్తారంగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సమానత్వం కోసం ఉద్యమించాలి

ఐద్వా నగర మహాసభలో డాక్టర్ ఉదయిని

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సామాజికంగా వెనకబడి ఉన్న మహిళలకు విద్య, ఉపాధి అవకాశాలను మరింత విస్తృతంగా అందించగలిగితే సమాజం వేగంగా అభివృద్ధి చెందుతుందని బెతాన్ నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ యన్.ఉదయిని అన్నారు. స్త్రీ, పురుష సమానత్వం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివారం నాడు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఒంగోలు నగర 12వ మహాసభ స్థానిక ఎల్‌బిజి భవన్‌లో నిర్వహించారు. ఐద్వా నగర అధ్యక్షురాలు బి గోవిందమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సభలో డాక్టర్ ఉదయిని మాట్లాడుతూ సమాజంలో తరతరాలుగా ఉన్న మూఢనమ్మకాలూ, పితృస్వామిక భావజాలమే మహిళల అభ్యున్నతికి ప్రధాన అడ్డంకులుగా నిలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అవాంతరాలను తొలగించుకొని మారుతున్న సమాజానికి అనుగుణంగా మహిళలు కుటుంబంలోనూ, సమాజంలోనూ ఎదురయ్యే సమస్యలను అధిగమిస్తూ అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నారని చెప్పారు. అయినప్పటికీ ఇంకా కొన్ని సనాతన సంప్రదాయాల పేరుతో బాల్యవివాహాలు, చిన్న వయసులోనే ప్రసవాలు జరుగుతూ.. అవగాహన లేకపోవడం వల్ల అనేక మరణాలు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తగిన పోషకాహారం అందక రక్తహీనత, ఎముకల సమస్యలు ఇలా ఎన్నో వ్యాధులు తలెత్తుతున్నాయని తెలిపారు. వీటి నివారణకు విద్యే ఏకైక మార్గమని, ప్రభుత్వాలు మహిళల విద్యపై మరింత శ్రద్ధ పెట్టాలని సూచించారు. విద్యతో పాటు ఆరోగ్యపరమైన అవగాహన కలిగి ఉంటే బాల్యవివాహాలు, శిశు మరణాలు, రక్తహీనత వంటి సమస్యలు తగ్గుతాయని చెప్పారు. కుటుంబ జీవనంలో బాలబాలికలిద్దరినీ సమాన దక్పథంతో

మాట్లాడుతున్న డాక్టర్ ఉదయిని

చూడాల్సిన వాతావరణం పెరగాలని అన్నారు. ఐద్వా లాంటి సంస్థలు సమాన హక్కుల కోసం పోరాడుతూ, మహిళలకు అండగా నిలుస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు.

రాష్ట్ర ఐద్వా నాయకురాలు డి. శ్రీనివాసకుమారి మాట్లాడుతూ ఐద్వా దేశ వ్యాప్తంగా కోటి 30 లక్షల సభ్యులతో కొనసాగుతూ మహిళా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మహిళలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత ఐద్వా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, కే.రాజేశ్వరి, యన్.నరసమ్మ, కె.రాణి, జి.కళ్యాణి, పి.ప్రేమలత, కె.విజయలక్ష్మి, ఎస్‌కే.మోబీనా, బి.రంగమ్మ, ఏ.రాజ్యలక్ష్మి, పి.లక్ష్మి, డి.మధురవాణి తదితరులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఐద్వా జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బదిలీ అయిన ఉపాధ్యాయులకు

జీతాలు విడుదల చేయాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ప్రకాశం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం ఆదివారం నాడు యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ బదిలీలు పూర్తయి నెల రోజులు గడుస్తున్నా కొత్త పోస్టులకు పొజిషన్ ఐడీలు ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయుల జీతాల సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో రిలీవర్స్ లేకుండా చాలామంది ఉపాధ్యాయులు పాత పాఠశాలల్లోనే కొనసాగుతున్నారని, డీఎస్సీ ద్వారా పోస్టులు ఇవ్వబడినా ఇంకా 500 ఎస్‌జిటి పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత గల అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లను తక్షణమే నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి

మాట్లాడుతున్న కొమ్మోజు శ్రీనివాసరావు

నుండి పాత పీఆర్సీ కమిటీని రద్దు చేయడం తప్ప కొత్త పీఆర్సీ, ఐఆర్ ప్రకటనలపై ఎటు వంటి ప్రగతి లేకపోవడం ఉద్యోగులు, ఉపాధ్యాయులలో తీవ్ర నిరాశకు కారణమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే చెల్లించడమే గాక, కొత్త పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఒక గంట అదనంగా పనిచేసి పేద, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేయాలని సూచించారు. సమావేశం అనంతరం ఎస్‌టిఎఫ్ఐ 9వ ఆల్ ఇండియా ట్రైనియల్ కాన్ఫరెన్స్ పోస్టర్‌ను ఎస్‌టిఎఫ్ఐ ఈసీ సభ్యులు కొమ్మోజు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై, ప్రధాన కార్యదర్శి డి. వీరాంజనేయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.రవి, సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, జిల్లా కోశాధికారి ఎస్.చిన్న స్వామి, జిల్లా కార్యదర్శులు ఎం.సత్యనారాయణ రెడ్డి, పి.బాలవెంకటేశ్వర్లు, సిహెచ్.ప్రభాకర్‌రెడ్డి, ఎం.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు వెల్లటూరు ఛానల్‌కు నీళ్లు లేనట్టే.!

బిఎం డ్రైన్‌పై నిర్మాణంలో ఉన్న వంతెన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత అక్టోబర్ నెలలో బిఎం డ్రెయిన్‌పై ఉన్న వెల్లటూరు ఛానల్ అక్విటెక్ట్ శిధిలావస్థకు చేరి కూలిపోవడంతో దాని స్థానంలో కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో చేపట్టిన చప్ట పనులు శరవేగంగా సాగుతున్నప్పటికీ నెలాఖరు వరకు సాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. గడచిన రెండు నెలలుగా పనులు జరుగుతున్నప్పటికీ సాగునీరు విడుదల సమయానికి పూర్తి కాలేదు. ఈపాటికే కృష్ణ పశ్చిమ బ్యాంక్ కెనాల్‌కు గత వారం రోజుల నుండి సాగునీరు పారుతున్నప్పటికీ వెల్లటూరు ఛానల్‌పై నిర్మాణంలో ఉన్న అక్విడేక్టు పనుల కారణంగా నీళ్లు వదలలేదు. జులై ఆఖరు నాటికి పనులు పూర్తి చేసి సాగునీటిని విడుదల చేయాలనే దృక్పథంతో ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సుమారు రూ.10.60 కోట్లతో చేపట్టిన అక్విటెక్టు నిర్మాణంతోపాటు వెల్లటూరు ఛానల్‌పై కాలినడక వంతెన, బిఎం డ్రైన్‌పై వాహనాల రాకపోకలకు మరో వంతేనను నిర్మాణం చేస్తున్నారు. వీటితో పాటు వెల్లటూరు ఛానల్‌కు అక్విడక్టు నుండి దిగువ వైపుకు, ఎగువ వైపుకు ఇరువైపులా కాంక్రీట్ వాల్స్ కూడా నిర్మిస్తున్నారు. ఈ కాంక్రీట్ గోడలు చివరి వరకు అక్విడెక్టు నుండి కాలువలో కాంక్రీట్ బెడ్ కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ నిర్మాణం దాదాపు 95శాతంపైగా పనులు పూర్తి చేసుకున్నప్పటికీ అక్విడెక్టులో అధిక నీరును డ్రెన్‌లోకి మళ్ళించటానికి ఏర్పాటు చేస్తున్న మూడు లాకుల పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ లాకుల పనులు పూర్తి కాగానే కాలువలో కాంక్రీట్ బెడ్డు ఏర్పాటు చేస్తే దాదాపు అక్విడెక్టు నిర్మాణ పనులు పూర్తయినట్లే. దీని ప్రక్కనే నిర్మిస్తున్న వంతెన పనులు ప్రస్తుతం పిల్లర్లు, కాంక్రీటు పనులు జరుగుతున్నాయి. దీనిపై స్లాబు నిర్మాణ చేపట్టేందుకు మరో నెల రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. అయినప్పటికీ వెల్లటూరు చానల్‌లో నీటిని విడుదల చేసినప్పటికీ వంతెన నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకం ఉండదు. ముందుగా వెల్లటూరు ఛానల్‌పై నిర్మిస్తున్న అక్విడెక్టు నిర్మాణ పనులు పూర్తికాగానే రైతులకు సాగునీటిని విడుదల చేసేందుకు కృతనిత్యంతో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఖరీఫ్ సీజన్ ఆలస్యం అవుతుందని రైతుల ఆందోళన

వెల్లటూరు ఛానల్ కింద భట్టిప్రోలు, వేమూరు, నగరం, చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాల్లో వ్యవసాయ భూములకు సాగునీరు అందాల్సి ఉంది. ఈ నెలాఖరుకు సాగునీటిని విడుదల చేస్తే అప్పటికే సుమారు 15 రోజులు సాగు ఆలస్యం అయినట్లు అవుతుందని, దీని కారణంగా రబీ సీజన్ ఆలస్యమైతే 2వ పంట పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సకాలంలో లేకపోవడంతో అధిక శాతం రైతులు సాగునీటి కోసమే ఎదురు చూస్తున్నారు. కొంతమంది రైతులు ఏదో ఒక టైంలో వర్షం పడకపోతుందా అనే భావనతో వెద పైరుకు శ్రీకారం చుడుతున్నారు. నెలాఖరు నాటికి సాగునీటిని విడుదల చేస్తే రైతులు నారుమడులు పోసుకొని తడుపులు పెట్టుకోవటానికి మరో వారం రోజులు పడుతుందని, దీని కారణంగా ఆగస్టు ఆఖరు లేదా సెప్టెంబర్ మొదటి వారం నుండి వరి నాట్లు వేసే పరిస్థితి ఉంటుందని అంటున్నారు. రభీ సీజన్‌లో అపరాల సాగుకు ఆలస్యమైతే దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. అయినప్పటికీ అధికారులు రైతుల ఆలోచన విధానాలను, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులు పూర్తి చేసి సాగునీరు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కాలువకు ఇరువైపుల సిమెంటు కట్టల నిర్మాణం

నిర్మాణం పూర్తవుతున్న అక్విడెక్టు

స్థూపం సెంటర్లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేష్

మాదక ద్రవ్యాల నివారణే లక్ష్యం

ప్రజాశక్తి - ఇంకొల్లు

మాదక ద్రవ్యాలు పూర్తి స్థాయిలో నివారించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. స్థానిక స్థూపం సెంటర్లో మాదక ద్రవ్యాల నివారణపై యువకులకు ఆదివారం అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడి జీవితాన్ని పాడు చేసుకుంటున్నారని అన్నారు. తల్లి, తండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి పిల్లల నడవడిక గమనించాలని అన్నారు. ఎక్కడైనా ఎవరైనా విద్యార్థులు చిన్నారులు మాదక ద్రవ్యాలు సేవిస్తున్నట్లు తెలిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. తమ పిల్లలు కాదుకదాని వదిలేస్తే ఆస్థానంలో మీ పిల్లలు కూడా ఉండే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈపాటికే అనేకమందిని గుర్తించి ఈగల్ టీం ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ చేసి యువతలో మార్పు తీసుకు వస్తున్నామని చెప్పారు. మాదక ద్రవ్యాలు ఎక్కడైనా విక్రయిస్తున్న, సేవిస్తున్న తమకు 1972 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు.

జూదరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని గంగవరం గ్రామం శివారు పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు ఆ ప్రాంతంలో దాడులు చేశారు. పేకాట స్థానం, వ్యక్తులను డ్రోన్ ద్వారా ఆదివారం గుర్తించారు. ఎస్ఐ జి సురేష్ తన సిబ్బందితో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.12,100 నగదు తోపాటు, 9 సెల్ ఫోన్స్, 4 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలపై డ్రోన్ సాంకేతికతతో నిఘా ఉంచినట్లు తెలిపారు.

తనిఖీలు చేస్తున్న లీగల్‌మెట్రాలజీ సిఐ నాగేశ్వరరావు

తూనికలు కొలతల శాఖ అధికారుల దాడులు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక కూరగాయల మార్కెట్ పరిసర ప్రాంతాల్లోని దుకాణాల్లో తూనికలు కొలతల శాఖ అధికారులు ఆదివారం దాడులు చేశారు. లీగల్ మెట్రాలజీ సిఐ కరేటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చికెన్, మటన్ దుకాణాల్లో, బిస్మిల్లా మటన్ షాపుల తూకాల్లో లోపాలు ఉన్నట్లు గమనించారు. ఆయా దుకాణాల వేయింగ్ మిషన్లను సీజ్ చేయడంతోపాటు వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగ దారులు మోసపోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. దుకాణ దారులు తూకాలు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. మోసానికి పాల్పడితే చర్యలు ఉంటాయని అన్నారు. కేజీకి తక్కువ తూకాలతో సరుకులు ఇస్తున్నట్లు గుర్తించామని అన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - బాపట్ల

అత్యవసర పరిస్థితుల్లో జీవితాన్ని కాపాడటానికి రక్తదానానికి మించిన దానం ఇంకొకటి లేదని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ డాక్టర్ శరత్ బోస్ అన్నారు. పట్టణంలోని ఏక హౌస్ ఆవరణలో మానవత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రక్తదానం, అవయవ దాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడే అనేకమందిని రక్త దానం, అవయవ దానంతో కాపాడ గలమన్నారు. మనలోనే ఎవరో ఒకరికి రక్తం అవసరమైనప్పుడు రక్తదానం ప్రాధాన్యత తెలుస్తుందని అన్నారు. రక్తం ఎవరికి ఎప్పుడు అవసరమవుతుందో ఎవరూ చెప్పలేరని అన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని తెలిపారు. శిబిరంలో 17 మంది స్వచ్ఛందంగా రక్తదానం, 12 మంది అవయవ దానం, 11 మంది శరీర దానానికి ముందుకోచ్చారని తెలిపారు. సేవా కార్యక్రమాలు నిర్వహణలో చీరాల, కర్లపాలెం మానవతా సంస్థ, బాపట్ల మహిళా సమాఖ్య సహకారంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. శిబిరంలో సంస్థ అధ్యక్షులు బొంగులూరి హరి ప్రసాద్, చీరాల అధ్యక్షులు ఎ నాగ వీరభద్ర చారి, కార్యదర్శి వడలి రాధాకృష్ణ, కోశాధికారి గుత్తి శివ కుమార్, బాపట్ల ఉపాధ్యక్షులు అల్లాడి. రవికుమార్, మహిళా సమైక్య అధ్యక్షురాలు కోలా పద్మజ, సంస్థ మహిళా కార్యదర్శి కర్పూరపు మంజులత, సన్నంశెట్టి కేశవులు, ఎం సూరిబాబు, కరణం రవీంద్ర, జి శాంతారామ్, సిహెచ్‌వివి సత్యనారాయణ, కోలా సుబ్బారావు, ప్రసన్నాంజనేయులు, తోట రామాంజనేయులు, చీరాల ప్రభుత్వ వైద్యశాల రక్తనిధి సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న దాతలు

ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు, మెరైన్ పోలీసులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - బాపట్ల

సముద్ర తీర ప్రాంత మత్స్యకార కుటుంబాలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని సూర్యలంక మెరైన్ పోలీసు స్టేషన్ సిఐ టి లక్ష్మారెడ్డి అన్నారు. మెరైన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బాపట్ల యజ్ఞ హాస్పిటల్స్ సౌజన్యంతో స్టేషన్ పరిధిలోని రామ్ నగర్ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని సీఐ తెలిపారు. బాపట్ల యజ్ఞ హాస్పిటల్ వైద్య బృందం గుండె, స్త్రీల ఆరోగ్యం, ఎముకలు, కీళ్లు, బిపి, డయాబెటిస్, ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. శిబిరంలో 200 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ సేవలు విస్తృతం చేయాలి

ప్రజాశక్తి - వేటపాలెం

సమాజంలో అవసరాలను గుర్తించి సేవలందించడంలో రోటరీ ముందంజలో ఉందని, సేవకు ప్రతిరూపం రోటరీ సంస్థని, రోటరీ సేవలు విస్తృతం చేయాలని రోటరీ పూర్వపు గవర్నర్ పి శివన్నారాయణ తెలిపారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో నూతన పాలకవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం నిర్వహిం చారు. క్లబ్ అధ్యక్షులుగా ఎవి సురేష్ బాబు రెండోసారి, కార్యదర్శి అక్కల చంద్రశేఖరరెడ్డి, కోశాధికారి రొండా దశరధరామిరెడ్డి నియమితులు అయ్యారు. ఇన్‌స్టలేషన్ అధికారిగా అధ్యక్ష, కార్యదర్శులచే ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. నూతన సభ్యులు పోలకం చంద్రశేఖర్‌కు స్వాగతం పలికారు. క్లబ్ సేవలు అభినందించారు. క్లబ్ పురోభివృద్ధికి తోడ్పడి సభ్యులను పెంచాలని, సేవాభావం కలిగిన వారు క్లబ్ సభ్యులుగా చేరాలని కోరారు. గ్రామానికి చెందిన పల్లపోలు నాగమనోహర్ లోహియా తన శరీరాన్ని మరణానంతరం రోటరీకి దానం చేస్తున్నట్లు సభా ముఖంగా తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు, అన్యువల్ గివింగ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కెఎస్ఆర్‌కె ప్రసాద్, ఛార్టెడ్ ప్రెసిడెంట్ గొల్లపూడి సీతారాం, ఎవి సురేష్ బాబు, కొత్త శ్రీనివాసరావు (వాసు), కె శివరామకృష్ణ, ప్రత్తి వెంకట సుబ్బారావు, బట్ట మోహనరావు, పి శ్రీనివాసరావు, పి చంద్రశేఖర్, ఊట్ల వెంకటేశ్వర్లు, దివి పవన్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన క్లబ్ పాలకవర్గం

కొత్త పెన్షన్ల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - అద్దంకి

మూడు నెలల క్రిందట అర్హులైన వితంతు పింఛన్లు మంజూరైనప్పటికీ ఇప్పటి వరకు లబ్దిదారులకు నగదు అందజేయకపోవడంతో మహిళలు పెద్ద ఎత్తున నిరసన గలాన్ని విప్పుతున్నారు. టిడిపి ఆరు పథకాల గురించి ప్రజల్లోకి వెళ్లి ఎమ్మెల్యేలు, మంత్రులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సిఎం చంద్రబాబు నాయుడు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రజలు ఆరు పథకాలు గురించి వెళ్లిన సమయంలో అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాన్ని వదిలి ప్రభుత్వం పథకాలు గురించి వివరించండని చెప్పడంపై ప్రజలు అసహనంతో ఉన్నారు. వైసిపి ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు వేశారని, ప్రస్తుత ప్రభుత్వంలో మాటలు తప్ప ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడం లేదని వితంతు మహిళలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన వితంతులకు పింఛన్లు వెంటనే నగదు మంజూరు చేయాలని మహిళలు కోరుతున్నారు.

ప్రజాశక్తి
సోమవారం 21 జులై 2025

వైద్య కళాశాల పనులకు మోక్షం ఎప్పుడో.?

సమీక్షలకే పరిమితమవుతున్న వైనం

ప్రజాశక్తి - బాపట్ల

గత ప్రభుత్వంలో మంజూరైన వైద్య కళాశాల నిర్మాణ పనులు పునాదులుకే పరిమితం అయ్యాయి. బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు గత వైసిపి ప్రభుత్వంలో బాపట్లలో రూ.505 కోట్ల వ్యయంతో వైద్య కళాశాల నిర్మాణానికి గతంలో శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అతిగతి లేదు. అక్కడున్న నిర్మాణ సామాగ్రి తరలిపోయింది. కట్టడాలు నిర్మాణానికి చేర్చిన ఇసుక సైతం తరలించారు. కళాశాల నిర్మాణంపై అధికారులు సమీక్షలు చేస్తున్నారే తప్ప క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదు. వైద్య కళాశాల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం పిపిపి పద్ధతిలో నిర్మించాలని ప్రతిపాదించింది. అయితే ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ఈ విధానాన్ని వ్యతిరేకించాయి. ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రజలకు వైద్యం భారమే తప్ప ప్రయోజనం ఉండదనేది భావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే అభివృద్ధి చేస్తే అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పనలతో పాటు ప్రజలకు మేలు జరుగుతుంది. ప్రైవేటు భాగస్వామ్యంతో

పునాదులకే పరిమితమైన వైద్య కళాశాల

నిర్మించాలనే ప్రభుత్వ యోజన పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు దీనిపై నోరు మెదపడం లేదనే విమర్శలు ఉన్నాయి. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సంక్రమించే అంతుచిక్కని రుగ్మతలకు తీర ప్రాంత ప్రజలకు వైద్యం అందించేందుకు శ్రీకారం చుట్టిన వైద్య కళాశాల నిర్మాణానికి అడుగు ముందుకు పడకపోవడం పాలకుపక్షంపై ప్రతిపక్షాలు ప్రజలు విమర్శిస్తున్నారు. నిర్మాణంపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో జిల్లా పాలనాధికారి సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. జిల్లాకు తలమానికగా ఉండేలా రూ.505 కోట్ల నాబార్డ్ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నిధులతో నిర్మించేలా ఆమోదముద్ర లభించిందని అన్నారు. మొదటి దశలో రూ.297 కోట్లు నిధులు మంజూరు చేశారు. అందులో నాబార్డు నుంచి రూ.252 కోట్లు మంజూరు కాగా రూ.45కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. 100 సీట్లతో వైద్య కళాశాల, 450 బెడ్లతో ఆసుపత్రి నిర్మించాలని ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 51 ఎకరాలు వైద్య కళాశాలకు భూమి కేటాయించగా 15 ఎకరాల్లో కళాశాల నిర్మాణ పనులు చేపట్టేందుకు మెగా ఇంజనీరింగ్ వర్క్స్ ఏజెన్సీ అప్పగించారు. నిర్మాణ పనులు 15శాతం అంటే రూ.70 కోట్ల విలువైన పనులు జరిగాయని, రూ.20 నుండి రూ.25 కోట్లు మంజూరు అయ్యాయని అన్నారు. మరో రూ.45 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. వైద్య కళాశాల నిర్మాణం పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఏడాదికే అధ్వన్నంగా బోడవాడ, రమణయపాలెం తారు రోడ్డు

అధ్వానంగా రహదారి

- గుంతలు పూడ్చి మరమ్మతులు చేయాలి
- మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులు కరువు
- అధికారుల చర్యలు చేపట్టాలని వినతి

ప్రజాశక్తి - పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరు, చెరుకూరు గ్రామాల మధ్య దూరం తగ్గిస్తున్న బోడవాడ, రమణయపాలెం తారు రోడ్డు గుంతలు ఏర్పడి అద్వాన్నంగా తయారైంది. అప్పుడే ఈ దుస్థితికి చేరిందంటే అతిశయోక్తి కాదు. ఆరు కిలోమీటర్ల మేర వేసిన సింగిల్ వే తారు రోడ్డు చెరుకూరుకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఆయా గ్రామాల పొలాలకు చేరుకునే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. పర్చూరు నుండి చెరుకూరు చేరుకోవడానికి 5 కిలోమీటర్ల దూరం ఈ రోడ్డు ద్వారా వెళ్తే తగ్గుతుంది. ఈ రోడ్డును ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం క్రింద ఏడాది క్రితం వేశారు. ఏడాదికే రోడ్డు పెచ్చులు లేవడం, గోతులు ఏర్పడటం, గ్రావెల్ పైకి లేవడంతో పెద్ద పెద్ద వాహనాలు అతి లోడుతో వెళ్లడం వల్ల రోడ్డంతా గుంతల మయంగా మారింది. ఈ రోడ్డు గుండా ప్రయాణించే వాహన దారులు అవస్థలు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మలుపులు ఉన్నచోట ప్రమాదాలు జరకకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కల్వర్టు వద్ద రెండు చోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. వేగంగా వచ్చే వాహన చోదకులకు దగ్గరకు వచ్చే వరకు గోతులు కనిపించడం లేదు. ఆ వేగం ఆపుకోలేక ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఏర్పడింది. ఆదమరిస్తే ప్రమాదం జరిగే పరిస్థితి ఉంది. రాత్రి సమయాల్లో మరింత ఎక్కువగా ప్రమాదం జరిగే అవకాశాలు పొంచి ఉన్నాయి. రోడ్డు వేసిన కొద్ది నెలలకే వరద వచ్చి ఈ రోడ్డు పక్కన పెద్ద పెద్ద గుంటలు పడ్డాయి. మరమత్తులు చేయకుండా ఈ రోడ్డును ఇలాగే వదిలేస్తే మరింత నష్టం జరగనుండి. రోడ్డు పూర్తిగా చెడిపోయే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు ఏర్పడిన గుంతలు పూడ్చి, మరమ్మత్తులు చేయాలని ఆయా గ్రామాల ప్రయాణికులు, వాహదారులు, గ్రామస్తులు అధికారులను వేడుకుంటున్నారు. రూ.కోట్లు ఖర్చుపెట్టి వేసిన రోడ్డు ఏడాదికే గోతులు పడటంతో రోడ్డు నాణ్యతపై విమర్శలు వస్తున్నాయి. ఎప్పటికప్పుడు రోడ్డు మరమ్మత్తులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో చేసిన ఖర్చు బూడిదలో పోసిన పన్నీరు చందాన మారుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మత్తులు చేయించాలని కోరుతున్నారు.

చీరాలలో భారీ వర్షం

- రహదారులు జలమయం
- రోడ్లపై వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలో ఆదివారం మధ్యా హ్నం నుంచి అనూ హ్యంగా కురిసిన భారీ వర్షంతో రహదారులు జలమ యం అయ్యాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. శాంతి థియేటర్ రోడ్డు, బస్టాండ్, మున్సిపల్ ఆఫీసు రోడ్, ముక్కోణపు పార్కు సెంటర్ ప్రాంతాల్లో మోకాళ్ల లోతు నీరు నిలిచింది. దీంతో చాలా మంది ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. అవసరమైన పని ఉన్నవారే బయటకు రావాల్సి వచ్చింది. ఆటో, బైక్ వాహనదారులు తమ వాహనాలను నెమ్మదిగా నడిపిస్తూ నానా అవస్థలు పడ్డారు. పట్టణంలో డ్రైనేజీ నీరు ప్రధాన ప్రవహించే మసీదు సెంటర్లోని పైపు లైన్ మరమ్మత్తులకు గురి కావటంతో కుందేరులో కలిసే వర్షం నీరు అంతా రోడ్లపై చేరింది. పలుచోట్ల విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు పునరుద్దరణ పనులు చేపట్టారు. పొలిమేర రోడ్డులో విద్యుత్ తీగల వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు రావడంతో అప్రమత్తమైన విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. జనరేటర్ వైర్లు షాట్ సర్క్యూట్ వల్ల మంటలు వచ్చినట్లు గుర్తించి నివారణ చర్యలు చేపట్టారు.

వర్షంలో గొడుగులతో ప్రయాణిస్తున్న యువకులు

వర్షంతో రైతుల్లో ఆనందం

పర్చూరు: తీవ్రమైన ఎండలతో వేసవిని తలపిస్తున్న పరిస్థితుల్లో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం ప్రజలకు కొంత సేద తీర్చినట్లు అయినది. వాతావరణం చల్లబడటంతో ఉక్కపోతకు గురైన ప్రజలకు కొంత స్వాంతన దొరికింది. చీరాల రోడ్డు, ఇంకొల్లు రోడ్డు, చిలకలూరి పేట వైపు రోడ్లలో వర్షపు నీరు నిలిచింది. వాహన దారులు, పాదచారులు అసౌకర్యానికి గురయ్యారు. ఈ వర్షంతో రైతులలో కొంత ఉత్సాహం కలిగించింది.

యద్దనపూడి : పూనూరు, పోలూరు, యద్దనపూడి, యనమదల, అనంతవరం, సూరవ రపుపల్లి గ్రామాల్లో ఆదివారం వర్షం కురిసింది. పంటలకు ఉపయోగపడుతుందని కొందరు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాని పొలాల్లో నల్లబెల్లి పొగాకు మండెలు వేసిన రైతులు ఉన్నారు. ఆ మండేలం మీద కప్పిన పరదాలు చిరిగి బెజ్జలు ఉన్న చోట్ల వర్షపు నీరు కారి పోగాకు తడిచే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పర్చూరులో కుండపోత వర్షం

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆనందబాబు

సమస్యల పరిష్కారానికే సుపరిపాలన : ఆనందబాబు

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని చంపాడు గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. శాసన సభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఇంటి ఇంటికి వెళ్లి ఏడాది కాలంలో గ్రామంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి పాంప్లెట్ రూపంలో అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నమోదు చేసుకొని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనీ ఇచ్చారు. కార్యకర్తలు గ్రామాల్లో గుర్తించిన సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, తెలుగుదేశం నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, నాయకులు పాల్గొన్నారు.

స్థానిక పరావర్తన భవనంలో సమావేశమైన దళితులు

వైసిపి కన్వీనర్ పదవి ఎస్సీలకు ఇవ్వాలి

ప్రజాశక్తి - పర్చూరు

వైసిపి మండల కన్వీనర్ పదవిని ఎస్సీలకు కేటాయించాలని ఆ పార్టీ ఎస్సి ప్రతినిధులు కోరారు. మండలంలోని దళితులు స్థానిక పరివర్తన భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైసిపి కన్వినర్ పదవీ ఎస్సీలకు కేటాయించాలని తీర్మానం చేసుకున్నట్లు తెలిపారు. దళితుల ఓట్లు అధికంగా ఉన్న నియోజకవర్గంలో ఆరు మండలాల వైసిపి కన్వినర్లను ప్రకటించారని, కానీ ఎస్సీలకు ఇవ్వాల్సిన ఒక్క పదవి కూడా ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయాన్ని వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ దృష్టికి తీసుకువెళ్ళాలని తీర్మానం చేసుకున్నట్లు తెలిపారు. గతంలో ఇంకొల్లు కన్వీనర్ పదవి ఎస్సిలకు కేటాయించి ఇప్పుడు ఇతరులకు ఇచ్చారని, ఈసారి పర్చూరు కన్వీనర్ పదవి ఎస్సిలకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కూరాకుల ఇస్సాకు, గేరా స్వరాజ్, జూపూడి రోశయ్య, గుజ్జుర్లపూడి చిన్న, కట్ట రత్నరాజు, మద్దిరాల శాంతారావు, మద్దిరాల విజయ్, బిల్లా అశోక్ పాల్గొన్నారు.

కులవృత్తికి ఆదరణ కరువు

ప్రజాశక్తి - యద్దనపూడి

భిక్షాటన చేస్తున్న దృశ్యం

మండలలోని సూరవరపు పల్లిలో గంగిరెద్దుతో బిక్షాటన చేస్తున్న గాదం ఏడుకొండలును 'ప్రజాశక్తి' పలకరించగా ఇది తమ కులవృత్తి అని, తాను యాదవ రాజుల వంశంనకు చేసిన వాడినని, గంగిరెద్దుతో బిక్షాటన చేస్తు ఉంటానని తెలిపాడు. వినుకొండ సమీపంలోని ఉప్పరపాలెంకు చెందిన తనకు గంగిరెద్దుతో బిక్షాటన చేయవలసిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించగా తమ పూర్వీకులు యాదవ రాజులు పంపకాల చేసుకోవటంలో తమకు గంగిరెద్దులొచ్చాయని, కొంత మందికి గొర్రెలు వచ్చాయని చెప్పారు. గొర్రెలు వచ్చినవారు గొర్రెలు మేపుకుంటూ జీవిస్తున్నారని అన్నారు. తమకు గంగిరెద్దులు రాగా వాటితో బిక్షాటన చేస్తున్నామని చెప్పాడు. గతంలో ఆదరణ ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం అంతగా లేదని తెలిపారు. తనకు ఒక మగ పిల్లవాడు, ఇద్దరు ఆడపిల్లలు అన్నారని తెలిపారు. ఏడాదిలో 9 నెలలు కంటే ఎక్కువ కాలం ఇతర గ్రామాల్లో గడపాల్సి రావడంతో పిల్లల్ని చదువుకు పంపలేదని అన్నాడు. వారు కూడా తన వద్దనే సన్నాయి నేర్చుకుని ఇదే వృత్తి చేపడుతారని అన్నారు.

భూములు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో ప్రతినిధులు

దొనకొండలో భూముల పరిశీలన

ప్రజాశక్తి-దొనకొండ

దొనకొండలో భారత రక్షణశాఖ ఆధ్వర్యంలో బ్రహ్మోస్ క్షిపణుల పరిశ్రమ ఏర్పాటుకు డీఆర్‌డీవో ప్రతినిధులు ఆదివారం భూములను పరిశీలించారు. డీఆర్‌డీవో బృందం దొనకొండకు విచ్చేయగా కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, బాదాపురం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను చూయించారు. భూములకు సంబంధించిన వివరాలు మ్యాపుల ద్వారా వివరించారు. అనంతరం దొనకొండలోని బ్రిటీష్ కాలంనాటి విమానాశ్రయంను పరిశీలించారు. డిఫెన్స్ యూనిట్ దొనకొండలో ఏర్పాటు జరిగితే అందుకు అనుబంధంగా దొనకొండ విమానాశ్రయంను ఏ విధంగా ఉపయోగించుకోవచ్చు.. అనే అంశంపై వారు చర్చించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్‌మోహన్, ఏపీఈడీబీ అధికారిణి ఐశ్వర్య, తహశీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహశీల్దార్ నాగార్జునరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం..

మోకాళ్లపై నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె ఆదివారం నాటికి ఎనిమిదో రోజుకు, పారిశుధ్య కార్మికుల సమ్మె ఐదో రోజుకు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది కార్మికులు కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలంటూ ఉద్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒంగోలులో కార్మికులు మోకాళ్ల మీద నిలబడి ప్రభుత్వానికి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికులకు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని విమర్శించారు. కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

యూనియన్ కార్యదర్శి టి. విజయ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుండా కొత్త కార్మికులను పనిలోకి తెచ్చి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, ఇది అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఉద్యోగాల మీద బెదిరింపులు మానేయాలని ప్రభుత్వానికి హితవు పలికారు. నిరసన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు జి. నరసింహ, నాయకులు కె.మోహన్ రావు, జాలయ్య, వెంకట్రావు, అనిత, రమణ, ఎం.బాబు, ఏ.రవి, ఏడుకొండలు, వంశీ, సుధాకర్, శశి తదితరులు పాల్గొన్నారు.

కాశీరత్తమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అన్నదానం చేస్తున్న దృశ్యం

ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయంలో కాశీ రత్తమ్మ చిత్రపటానికి పలువురు పూలమాల వేసి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా మారెళ్ల వివేకానంద మాట్లాడుతూ శివం శరణాలయంలో వృద్ధులకు భోజనంతో పాటు కొత్త వస్త్రాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మహిళ అభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు టి.అరుణ, మారెళ్ళ కాశీరత్తమ్మ కుటుంబ సభ్యులు పేలప్రోలు రామకష్ణ పరమహంస (బిర్లా), బ్రహ్మానందం, మారెళ్ళ సుబ్బారావు, యక్కల తులసీరావు, దామచర్ల పూర్ణచంద్రరావు, అయ్యన్న, రావుల పద్మజ, మస్తాన్‌రావు పాల్గొన్నారు.

ఎర్ర తెగులుతో ఎండుతున్న పైరు

పత్తి రైతులకు తీరని నష్టం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పత్తి పంట..

పెద్దదోర్నాల మండలంలో ఈ సంవత్సరం పత్తి పంట రైతులను తీవ్రంగా దెబ్బ తీసింది. ముందస్తు సీజన్‌ను ఉపయోగించుకుని పంట సాగు చేపట్టిన రైతులకు ఈసారి ఎర్ర తెగులు రూపంలో పెను విపత్తే ఎదురైంది. మండలంలోని వివిధ గ్రామాల్లో మొత్తం 2,300 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బోర్లపై ఆధారపడే రైతులు చాలా మంది విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సాగు ఖర్చులు కలిపి ఒక్కో ఎకరానికి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పంట మొదట్లో పచ్చగా, ఆరోగ్యంగా పెరగడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఊహించిన రైతులకు మధ్యలోనే ఎర్ర తెగులు కంటి మీద కునుకు లేకుండా చేసింది. మొదటగా ఆకులు ఎర్రగా మారి నెమ్మదిగా రాలిపోవడం, అనంతరం పూతలు నేలకే రాలిపోవడం, చివరికి మొక్కలు పూర్తిగా ఎండిపోవడం వంటి దుస్థితి నెలకొంది.

ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేదు..

రైతులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ప్రతి కొత్త పురుగు మందును ప్రయోగించారు. రోజుకో మందు, రోజుకో ఆశ. కానీ తెగులుపై ఎలాంటి ప్రభావం చూపలేకపోయాయి. ఎంత ఖర్చుపెట్టినా ఫలితం లేకపోవడంతో రైతులు నిరాశకు లోనయ్యారు. ఇప్పటికే గత ఏడాది మిర్చి సాగుతో భారీ నష్టాలు మిగిలిన రైతులు, అప్పుల ఊబిలో ఉన్నవారే ఈసారి పత్తికి మొగ్గు చూపారు. అప్పులు తీర్చుకునే ఆశతో పత్తి సాగు చేసిన రైతులు ఇప్పుడు మరింత లోతైన ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిపోయారు. మిర్చి నష్టాన్ని పత్తితో తీర్చుకుంటాం అనుకున్నాం. పత్తే ఇప్పుడు మింగేసిందని వాపోతున్నారు. ఈ పరిణామాలతో రైతుల్లో తీవ్ర నిరాశ వ్యాపిస్తోంది. తమ పరిస్థితిని గమనించి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తాను నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసి ఇప్పటికే రూ.లక్ష దాకా పెట్టుబడి రూపంలో పెట్టానని పెద్దదోర్నాలకు చెందిన సుబ్బారెడ్డి తెలిపారు. అయితే ఎర్ర తెగులు సోకడంతో పైరు ఎండిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని వాపోయారు. యడవల్లి గ్రామానికి చెందిన గంటా శేఖర్ ఐదు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసినట్లు చెప్పారు. అయితే మొదట్లో పంట ఏపుగా పెరిగిందని, మంచి దిగుబడి వస్తుందని ఆశ పడ్డానని తెలిపారు. తీరా ఎర్ర తెలుగుతో ఎండిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తాను మూడు ఎకరాల్లో రూ.70 వేలు పెట్టుబడితో పత్తి పంటను సాగు చేశానని గంటవానిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు తెలిపారు. ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని భావించామని, తీరా ఐదు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. నష్టపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

యువతకు నైపుణ్యాభివృద్ధే లక్ష్యం

- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు
- 'ల్యాబ్ ఇన్ వీల్స్'లో శిక్షణా తరగతులు
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ
- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ యాదవ్ వెల్లడి

ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.రవితేజయాదవ్ పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో చదువుతున్న శిక్షణార్థులకు స్కిల్ సెంటర్ ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ల్యాబ్ ఇన్ వీల్స్ కార్యక్రమం ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. విదేశాలలో నర్సింగ్, వెల్డర్, ఫిట్టర్ పోస్టులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లా నైపుణ్య అభివద్ధి సంస్థ ద్వారా యువతకు అందిస్తున్న నైపుణ్య శిక్షణపై 'డిఎస్‌డిఓ' ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే..

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యాభివద్ధిలో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం.

4,598 మంది విద్యార్థులకు శిక్షణ

జిల్లాలోని 28 డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ సెంటర్స్ లో 2026 ఏప్రిల్ నుంచి 2025 జూన్ వరకు 4,598 విద్యార్థులకు శిక్షణ ఇచ్చాను అదేవిధంగా జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో నిరుద్యోగ యువతకు పది ద్వారా 2024 ఏప్రిల్ నుంచి 2025 జూన్ వరకు 1576 మందికి శిక్షణ ఇచ్చాం.

ల్యాబ్ ఇన్ వీల్స్‌కు విశేష స్పందన

జిల్లాలో ల్యాబ్ ఇన్ వీల్స్ శిక్షణకు విశేష స్పందన లభిస్తోంది ఇన్ఫోసిస్ కంపెనీ ద్వారా 300 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫండమెంటల్స్ అమెజాన్ వెబ్ సర్వీసెస్, ఈ కామర్స్ డిజిటల్ మార్కెటింగ్, టాలి విత్ జిఎస్టి, సైబర్ సెక్యూరిటీ వంటి అత్యాధునిక కోర్సుల్లో ఉచితంగా ఆన్లైన్ ,ఆఫ్లైన్లో సెక్షన్ ఇస్తున్నాం.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

నిరుద్యోగ యువతకు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ పై శిక్షణ ఇస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 62 జాబ్ మేళాలు నిర్వహించాం. ఆయా జాబ్ మేళాలకు 6435 మంది అభ్యర్థులు హాజరుకాగా 2815 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాం.

విదేశాలలో ఉద్యోగ కల్పనకు కృషి

విదేశాలలో నర్సింగ్, వెల్డర్, ఫిట్టర్ పోస్టులకు ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ కషి చేస్తోంది. విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించి యువత ఆర్థికంగా నిలబొక్కేందుకు సహకరిస్తుంది.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇస్తున్నాం. స్టార్ట్ యువర్ బిజినెస్ జనరేట్ యువర్ బిజినెస్‌లో శిక్షణ ఇస్తున్నాం. జిల్లాలో ఇప్పటివరకు 350 మందికి శిక్షణ ఇచ్చాం.

సెప్టెంబర్‌లో నైపుణ్య పోర్టల్

రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు నైపుణ్య పోర్టల్ సెప్టెంబర్ నుంచి అమల్లోకి రానుంది. ఇందులో అభ్యర్థులకు సంబంధించిన పూర్తి వివరాలు ఉంటాయి. ఇంటర్వ్యూ స్కిల్స్ అభివద్ధి చేసుకోవడానికి, అభ్యర్థుల బయోడేటా ఈ పోర్టల్ ద్వారా తీసుకోవచ్చు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలి. రానున్న కాలంలో జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు మరిన్ని ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం..